
కథ



# విందు పిలుపు

బెంగాలీ మూలం - విభూతిభూషణ్ బందోపాధ్యాయ

తెలుగు అనువాదం - వినూత్న

కుండపోతగా వర్షం కురుస్తోంది.

భాద్రపద మాసం! గత పదిహేను రోజులుగా వాన కురుస్తూనే ఉంది - ఎక్కడా తెరిపి ఇవ్వకుండా.

ఖుదీరామ్ భట్టాచార్య ఇంట్లో రెండు రోజుల నుంచి పొయ్యి వెలగనే లేదు.

ఖుదీరామ్ ఓ సాధారణ కుటుంబీకుడు! ఏదో పొలం మీద వచ్చే కొద్దిపాటి ఆదాయం, శిష్యులు, ఆ పూరి పెద్దమనుషులు ఇచ్చే దానదక్షిణలతో ఆయన సంసార చక్రం నడుస్తోంది.

ఈ భయానకమైన వాన కారణంగా ఆ గ్రామంలో చాలా కుటుంబాల్లో పిల్లలు అన్నానికి కరువువాచి ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

ఇక ఖుదీరామ్ మాట చెప్పాలా? గతంలో ఇచ్చిన ధాన్యం గింజలన్నీ అయిపోయాయి. భాద్రపద మాసం తర్వాత రైతుల ఇళ్ళకి కొత్త ధాన్యం వస్తే ఖుదీరామ్ ఇంటికి కాస్త వస్తుంది. అంతవరకూ పిల్లల కడుపు నిండటం వారి అదృష్టం మీద ఆధారపడి ఉంది.

ఖుదీరామ్‌కి ఇద్దరు పిల్లలున్నారు - నేపాల్, గోపాల్! నేపాల్ వయసు పన్నెండేళ్ళు కాగా గోపాల్ వయసు పదేళ్ళే!

కొద్దిరోజులుగా కడుపునిండా తినకపోవడంతో ఆ ఇద్దరు పిల్లలు వాడిపోయి ఉన్నారు.

'గోపాల్ - నీకు ఆకలేస్తుందా?' అనడిగాడు నేపాల్.

గోపాల్ చేపలు పట్టే గాలం తీసుకుంటూ అన్నాడు - 'అవును అన్నయ్యా!'

'మరి అమ్మను అడగొచ్చుగా? నా కడుపులో కూడా ఎలకలు పరిగెడుతున్నాయి'

'అమ్మ తిడుతుంది! నువ్వెళ్ళు'

'తిట్టనీ! నీ పేరు చెప్పి, నువ్వే అడగొచ్చుగా'

అదే సమయంలో శిబూ బెనర్జీగారి అబ్బాయి చునీ అటువైపు రావడం చూశాడు నేపాల్. 'ఓ చునీ! ఇలారా ఒక్కసారి!' అని పిలిచాడు.

వయసులో నేపాల్ కంటె పెద్దవాడు చునీ. కాస్త డబ్బున్న కుటుంబం నుంచి వచ్చిన కుర్రాడే!

నేపాల్ పిలుపు విని 'ఏమిటీ సంగతి?' అంటూ వచ్చాడు.

'లోపలికి రా!'

'లేదులే, లోపలికి రావడం వీలుపడదు! నేను జటీబువా ఇంటికెళ్తున్నాను. అమ్మ అక్కడ ఉంది. తనని పిల్చుకు రావడానికి వెళ్తున్నాను' అన్నాడు చునీ.

'ఈ సమయంలో మీ అమ్మ అక్కడేం చేస్తుంది?'

'అక్కడ పప్పు రుబ్బడానికి వెళ్ళింది. ఈ మంగళవారం తాళనవమి కదా! వాళ్ళింట్లో పెద్ద విందు ఉంది'

'నిజంగా?'

'నీకు తెలియదా? మా ఇంట్లో అందర్నీ విందుకి పిలిచారు. పల్లెలో అందర్నీ పిలుస్తున్నారు'

'మమ్మల్ని కూడా పిలుస్తారా?'

'ఊళ్ళో అందర్నీ పిలుస్తున్నప్పుడు మిమ్మల్ని మాత్రం ఎందుకు వదిలిపెడతారు?'

చునీ వెళ్ళిపోయాక నేపాల్ తమ్ముడివైపు తిరిగి అడిగాడు -'ఈ రోజు ఏ వారమో నీకు తెలుసటరా! శుక్రవారమా - మంగళవారమా విందు?'

'తల్చుకుంటే నోరూరుతుంది కదరా!' అన్నాడు గోపాల్.

'నోర్మూసుకో! నీకేమి తెలియడంలా! తాళనవమి పండగ ఎంత బాగా చేస్తారో తెలుసా?' అన్నాడు.

గోపాల్‌కి తెలియదు. కాని తన అన్న దగ్గర నుంచి తాళనవమి గురించి తెలుసుకుని ఎంతో ఆనందించాడు. ఎందుకంటే విందులో రకరకాల పిండివంటలు వడ్డిస్తారని.

ఆ రోజు ఏ వారమో తెలియదు కాని, వచ్చే మంగళవారమే పండగ అన్నారు కాబట్టి, ఎంతో దూరం లేనట్లే లెక్క.

ఇంటికి తిరిగొస్తుంటే, దారిలో జటాబువా ఇల్లు కనపడింది. 'నువ్విక్కడే ఉండు, నేను లోపలికెళ్ళి వాకబు చేసి వస్తాను. వీళ్ళకి పండగకి తాటిచెట్లు బాగా అవసరమవుతాయి. వీళ్ళు కొంటారు కూడా' అన్నాడు నేపాల్.

ఆ వూరిలో తాడిచెట్లు లేవు. ఊరు దాటాక విశాలమైన మైదానంలో తాటితోపు ఉంది. అక్కడ నేల మీద పడిన తాటాకులు, పళ్ళు తీసుకొచ్చి నేపాల్ వూరిలో అమ్ముతుంటాడు.

జటీబువా ఎదురుగా వచ్చి నిలబడింది. ఆమె నట్వర్‌ముఖర్జీగారి భార్య. ఆమె అసలు పేరు హరిమతి. కాని అంతా ఆమెని జటీబువా అని పిలుస్తుంటారు.

'ఏంట్రా సంగతి?' అని పలకరించింది బువా.

'మీకు తాటాకులు అవసరమవుతాయా?'

'ఆ, ఈ మంగళవారం తప్పకుండా అవసరమవుతుంది'

ఈలోగా గోపాల్ కూడా అక్కడికొచ్చి, అన్న పక్కనే నిలబడ్డాడు.

'ఎవర్రా ఆ వెనక నిలబడింది? గోపాలా? సాయంత్రం మీరిద్దరూ ఎక్కడికెళ్ళారు?' అని అడిగింది జటీబువా.

'చేపలు పట్టడానికి!' సిగ్గుతో నసిగాడు గోపాల్.

'మరి దొరికాయా?'.

'రెండు చిన్న చేపలు, ఒక మోస్తరు రాహూ చేప దొరికాయి! ఇక వెళ్ళమంటారా?'

'వెళ్ళిరండి బాబూ! బాగా చీకటి పడింది. ఈ వానాకాలంలో చీకటిలో తిరగడం ఏమంత మంచిది కాదు'

★ ★ ★

తాటాకులు, తాటిపళ్ళు తీసుకురావడం పట్ల జటీబువా ఆగ్రహం చూపనందుకు ఆనందించినా, విందుకు ఎందుకు పిలవలేదా అని అన్నదమ్ములిద్దరూ చర్చించుకున్నారు.

బహుశా తమని చూడగానే ఆ మాట మర్చిపోయి ఉంటుందనుకున్నారు.

'తాటిపళ్ళు, ఆకులు తీసుకొస్తున్నావా?' అని నేపాల్ అడిగాడు.

'ఇద్దాంలే కాని, డబ్బులెంత ఇస్తారు?'

'పైసాకి రెండు ఇద్దాం. మనం పైసాకి మూడు ఇద్దాం'

'మంచి బలమైన నల్లటి తాటిచెట్లు కనబడతాయా? తాళనవమికి ఎన్నో అవసరమవుతాయి'

'నల్లటివే వెదికి పట్టుకొద్దాం. నిశ్చింతగా ఉండు'

ఇంటి నుంచి బయటకి రాగానే గోపాల్ 'అన్నయ్యా - ఎప్పుడిస్తాం వీళ్ళకి తాటాకులు?' అనడిగాడు.

'రేపు!'

'అన్నయ్యా - వాళ్ళ దగ్గర నుంచి డబ్బులు తీసుకోవద్దు!'

నేపాల్ ఆశ్చర్యపోయాడు - 'ఎందుకు?' అన్నాడు.

'మనం అలా డబ్బులు తీసుకుంటే వాళ్ళు మనల్ని విందుకు పిలవరు!'

'ఛత్! నేనలా చేయను! తీసుకొచ్చి వాళ్ళకిస్తాను, డబ్బులు తీసుకుంటాను!'

★ ★ ★

రాత్రంతా వాన కురుస్తూనే ఉంది. దానికి తోడు చల్లటి గాలులు... తూర్పువైపు కిటికీ రెక్క గాలికి ఒకటే కొట్టుకుంటోంది.

గోపాల్‌కి నిద్ర రావడంలేదు. అతనికి భయమేస్తోంది.

మనసు నిండా ఒకటే ఆలోచన - అన్నయ్య వాళ్ళ దగ్గర నుంచి డబ్బులు తీసుకుంటే, భోజనాలకు పిలవరు. అయినా ఎందుకు పిలుస్తారు? గోపాల్ లేచి కూర్చున్నాడు.

ఇంట్లో వాళ్ళంతా మంచి నిద్రలో ఉన్నారు. తెల్లవారినా ఎవరూ లేవలేరు.

వానజోరు తగ్గింది. చినుకులు చినుకులుగా కురుస్తోంది. గోపాల్ తాటితోపు దగ్గరకు పరిగెత్తుకుంటూ వెళ్ళాడు.

ఆ తోపంతా ఒకటే నీళ్ళు - బురద!

ఆ దారమ్మట వెళ్తున్న గణేశ్ గోపాల్‌ని చూసి, 'ఒరే చిన్నోడా, ఇంత బురదలో ఎక్కడికిరా!' అన్నాడు.

'తాటాకులు ఏరుకుందామని!'

'అక్కడ పాములు చాలా ఉన్నాయి చిన్నోడా! వానలో ఒంటరిగా అక్కడ తిరగడం ప్రమాదం సుమా!' అన్నాడు.

గోపాల్ భయపడుతూనే తాటితోపులోకి వెళ్ళి వెదకసాగాడు.

నల్లటి పెద్ద తాడిచెట్లు కనబడింది. దానిని చూసేలోగా మరో మూడు చిన్నచిన్న తాడిచెట్లు కనపడ్డాయి. వాటిని ఒక్కసారి తీసుకెళ్ళడం గోపాల్‌కి సాధ్యం కాలేదు. ఒకదాని తర్వాత ఒకటి జటీబువా ఇంటికి చేర్చాడు.

అదే సమయానికి జటీబువా కళ్ళాపి జల్లుతోంది. అంత పొద్దున్నే గోపాల్‌ని చూసి ఆమె ఆశ్చర్యపోయింది. 'ఏమిటి సంగతి?'

'బువా, మీకోసమే తాటిచెట్లు తీసుకొచ్చాను' అని నవ్వుతూ చెప్పాడు గోపాల్.

ఆమె మారు మాట్లాడకుండా ఆ తాడిచెట్లు లోపలికి తీసుకెళ్ళింది.

ఆమెనే తాళనవమి ఎప్పుడో అడుగుదామనుకున్నాడు గోపాల్. కాని ధైర్యం చాలలేదు.

ఆ రోజంతా ఆడుకుంటున్నా గోపాల్ మనసు తాళనవమి చుట్టూ పరిభ్రమిస్తోంది.

ఆ రోజు రాత్రి తల్లిని అడిగాడు - 'అమ్మా ఈరోజు కప్పలు మామూలుగా అరవడం లేదేమిటి?'

'కొత్త నీరొచ్చిందనే ఆనందంతో ఉన్నాయి కప్పలు. నిలవ నీళ్ళలో వాటికి ఆనందం లేదు' అన్నది గోపాల్ తల్లి.

'ఈ రోజు ఏ వారం అమ్మా!'

'సోమవారం! అయినా ఈ విషయం తెలుసుకుని నువ్వేం చేస్తావ్?'

'మంగళవారమే తాళనవమి కదా అమ్మా!'

'కుండ నిండా అన్నమే వండటం లేదు. తాళనవమి గురించి తెలుసుకుని నేనేం చేయను?'

★ ★ ★

'నువ్వు జటీబువా ఇంట్లో తాటిచెట్లు ఇచ్చావా? నీకెక్కడ దొరికాయి? నేనీ రోజు తాటిచెట్లు తీసుకుని వెళ్తే, ఆమె చెప్పింది. డబ్బులు కూడా తీసుకోకుండా నువ్విచ్చావట కదా! ఊరికినే ఇవ్వాల్సిన అవసరమేమిట్రా?'

'డబ్బులు తీసుకుని ఉంటే ఏదన్నా తినేవారం కదరా!' అన్నాడు నేపాల్.

'మనమూ విందుకి వెళ్ళొచ్చుగా! రేపే తాళనవమి'

'అరే, డబ్బులు తీసుకున్నా, విందుకి పిలుస్తారు. నువ్వు నిజంగా బుద్ధిలేనివాడివి?'

'సరేలే! రేపేగా మంగళవారం?'

'అవును!'

ఆ రోజు రాత్రి గోపాల్‌కి నిద్రపట్టలేదు. ఇంకా ఎంతసేపటికి తెల్లవారుతుంది?

★ ★ ★

'బాబూ? పాయసం తీసుకున్నావా? పెసరపప్పు వేసుకున్నావా?' అని ఆప్యాయంగా అడిగింది జటీబువా.

ఆమె పెద్దమ్మాయి లావణ్య నువ్వుల లడ్డులు తీసుకొచ్చి గోపాల్ ఎదురుగా ఉంచింది. 'నువ్వెన్ని తినగలవో చూస్తాను!' అంది నవ్వుతూ.

అదయ్యాక తాటిగారెలు, ఖీర్ తీసుకొచ్చి ఇచ్చింది. 'నువ్వు తీసుకొచ్చిన వాటితోనే ఈ తాటిగారెలు వండాం. కడుపునిండా తిను! తాళనవమి రోజు ఏ ఒక్కటీ వదిలిపెట్టకూడదు' అంటూ ఆప్యాయంగా కొసరికొసరి వడ్డించింది.

వాతావరణం అంతా తినుబండారాల పరిమళంతో నిండిపోయి ఉంది. తిన్నాక, భుక్తాయాసంతో వెంటనే లేవలేకపోయాడు గోపాల్.

లావణ్య అక్క నవ్వుతూ అడుగుతోంది - 'ఇంకో నువ్వుండ తింటావా?'

★ ★ ★

'ఒరే గోపాల్!'

హఠాత్తుగా ఉలిక్కిపడి, కళ్ళు తెరిచి చూశాడు గోపాల్. తల్లి పిలుపుతో అతని నిద్ర చెల్లాచెదురయ్యింది.

'ఒరే లే! బారెడు పొద్దెక్కింది! ముసురువల్ల సమయం తెలియడంలేదు!' అన్నదామె.

వెర్రివాడిలా తల్లిని చూస్తూ, 'అమ్మా... ఈ రోజు ఏ వారం?'

'మంగళవారం!'

అంటే ఈ రోజే తాళనవమి! తను కలలో చూసిన రోజొచ్చేసింది.

ఆ రోజు మబ్బులవల్ల సమయమెంతో తెలియలేదు.

గోపాల్ ఇంటి ముందు ఓ చెక్కపీట వేసుకుని ఉన్నాడు. వాన కురవడం లేదు గాని ఆకాశమంతా మబ్బులు దట్టంగా ఉన్నాయి.

చలికి శరీరం గజగజా వణుకుతోంది. జటీబువా ఇంటి నుంచి విందుకు ఎవరూ కబురు చేయలేదేమిటా అని ఆలోచిస్తున్నాడు గోపాల్.

మరీ కాస్త పొద్దెక్కాక జగబంధు చక్రవర్తి సపరివార సమేతంగా ఆ దారమ్మట వెళ్ళడం చూశాడు గోపాల్. ఆయన వెనకే రాఖల్‌రాయ్, ఆయన కొడుకు సామా ఉన్నారు. ఆ వెనకే కాల్‌వీర్ బెనర్జీ పెద్ద కొడుకు పాంచూ, చిన్నకొడుకు హరేన్...

'వీరంతా ఎక్కడికి వెళ్తున్నారు?' అని గోపాల్ ఆలోచిస్తున్నాడు.

వారు వెళ్ళిన కొద్దిసేపటికి నవీన్‌భట్టాచార్య, ఆయన సోదరుడు దీనూ పిల్లాపాపలతో వెళ్ళడం కనపడింది.

'మీరెందాకా వెళ్తున్నారు?' అని ఓ కుర్రాడ్ని అడిగాడు గోపాల్.

'జటీబువా ఇంట్లో తాళనవమి విందు. మిమ్మల్ని పిలవలేదా? కేవలం కొద్దిమందినే పిలిచారా?' అని దీన్‌భట్టాచార్య చిన్నకొడుకు కుడోరామ్ ఆశ్చర్యపోయాడు.

గోపాల్‌కి పౌరుషం పొడుచుకొచ్చింది. కోపంతో వూగిపోతూ లేచాడు. 'మాకు ఎందుకు విందు ఇవ్వడం లేదూ? మిమ్మల్నే పిలిపించిందనుకుంటున్నారా? మాకూ పిలుపు వస్తుంది. మేము కాసేపున్నాక వెళ్తాం' అని అభిమానం నిండిన స్వరంతో అన్నాడు గోపాల్.

కుడోరామ్ కంగారుగా, 'అరే, ఇంత కోపం ఎందుకు, ఏమయింది?' అన్నాడు.

వారు వెళ్ళిపోయాక గోపాల్ కళ్ళల్లో నీళ్ళు నిండాయి - ఈ లోకపు అన్యాయపు తీరుచూసి.

ఈ రోజు కోసమే అతను ఇన్నాళ్ళూ ఇంతగా నిరీక్షించింది.

నీళ్ళు నిండిన కళ్ళ ముందు... హరూ, హితేన్, దేవేన్, మొదలయిన పిల్లలంతా తమ తండ్రులతో, చిన్నాన్నలతో కలిసి... గోపాల్ ఇంటి ముందు నుంచే అదే దారిన జటీబువా ఇంటికి వెళ్తున్నారు.

☆